# లాఠీలో కరుణ

– రేగులపాటి విజయలక్ష్మి

"ఒరే రవితేజ ! ఈ రోజు నీ పుట్టినరోజు కదా? మాకు పార్టీ ఇవ్వాలి" అన్నాడు డాక్టరు కోర్సు చదువుతున్న చక్రధర్. పదవ తరగతి చదువుతున్న రవితేజతో. "నా దగ్గర డబ్బులు లేవు" అన్నాడు రవితేజ.

"మాకు రెండు వేల రూపాయలతో తాగించాలి, మటన్ తినిపించాలి" అన్నాడు చక్రధర్, ఇతర ఫ్రెండ్స్.

"చక్రధర్ ! ప్లీజ్! నాకు అంత పెద్ద పార్టీ ఇవ్వడం చేతగాదు. ఏదో 500రూ॥లతో అంటే ఇస్తాను. ఆ డబ్బు కూడా ఇప్పుడు నా దగ్గర లేదు" అన్నాడు బాధతో రవితేజ.

"ఒరే ! మీనాన్న పెద్ద బిజినెస్ మ్యాన్ కదా నీ దగ్గర డబ్బు లేదంటావేమిటిరా? ప్రస్తుతం నేను పెడతాను తరువాత నీవు నాకు ఇవ్వాలి" అన్నాడు చక్రధర్. స్టడీ కొరకు అద్దెకు తీసుకున్న రూంలో మందు, మటన్‌తో జల్సా చేశారు. చక్రధర్ మందు తాగడం సిగిరెట్లు కాల్చడం మొదలు పెట్టాడు. చిన్న పిల్లలను స్నేహం చేసుకొని వాళ్ళ ద్వారా డబ్బు తెప్పించుకొని తన అవసరాలు తీర్చుకుంటున్నాడు. చక్రధర్‌కు తాత చేయించిన బంగారు గొలుసు అమ్ముకున్నాడు. తల్లి అడిగితే ఎక్కడనో పోయింది అని బదులు చెప్పాడు. నిజమే కావచ్చు అని నమ్మారు తల్లితండ్రులు.

నెలరోజుల తరువాత ఒకరోజు స్కూలునుండి వస్తున్న రవితేజను డబ్బులు ఇమ్మని అడిగాడు చక్రధర్.

నాదగ్గర లేవు బదులిచ్చాడు రవితేజ. "నీ దగ్గర లేకపోతే మీ ఇంట్లో దొంగతనం చేయి" అని సలహా ఇచ్చాడు చక్రధర్. "మా ఇంట్లో డబ్బు నగలు ఉంచరు. లాకర్‌లో దాస్తారు" అన్నాడు రవితేజ. "మీ నాన్న సెల్‌ఫోన్ తీసుకురా" అన్నాడు చక్రధర్.

చక్రధర్ పోరు భరించలేక సెల్ తీసుకువచ్చి అతనికిచ్చాడు రవితేజ. చక్రధర్ ఆ సెల్ ద్వారా ఆడపిల్లలకు ఫోన్ చేసి అసభ్యకరమైన మాటలు మాట్లాడసాగాడు. వాళ్ళు పోలీసు కంప్లైంట్ ఇవ్వగా కానిస్టేబుల్ వచ్చి రవితేజ తండ్రిని పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయారు. నా సెల్ పోయి నెలరోజులయింది. ఆ ఫోన్‌కాల్స్‌కు, నాకు ఏ సంబంధం లేదు. అని కొంత డబ్బు పోలీసువాళ్ళకిచ్చి ఆ కేసు నుండి బయటపడ్డాడు రవితేజ తండ్రి గోవర్ధనరావు.

ఇంటర్ చదువుతున్న కృష్ణను డబ్బులిమ్మని అడిగాడు చక్రధర్ తన దగ్గర డబ్బు లేదంటే అతని చేతికున్న ఉంగరం తీసుకుని అమ్ముకున్నాడు చక్రధర్. కృష్ణ తండ్రి హెడ్ కానిస్టేబుల్, కొడుకు చేతికి ఉంగరం కనిపించకపోతే "ఒరే కృష్ణా! నీ చేతి ఉంగరమేదిరా" అన్నాడు తండ్రి మొగిలయ్య. కృష్ణ జరిగిన విషయం చెప్పాడు.

అటువంటి వారి స్నేహం పట్టకూడదు. మంచివాళ్ళతో స్నేహం చేయాలి అన్నాడు మొగిలయ్య. ఒకరోజు డ్యూటీ లేని రోజు చక్రధర్ తండ్రి దగ్గరకు వచ్చాడు. మీవాడు అన్ని వ్యసనాలకు అలవాటు పడ్డాడు. మావాడి చేతి ఉంగరం తీసుకుని అమ్ముకున్నాడు. నేను అతని మీద కేసు పెట్టగలను. కాని అబ్బాయి మెడిసిన్ రెండో సంవత్సరంలో ఉన్నాడు. మీరు అతన్ని కష్టపడి చదివిస్తున్నారు. కేసులో ఇరుక్కుంటే అతని చదువుపాడవుతుంది. భవిష్యత్తులో విదేశాలకు వెళ్ళాలన్నా అవకాశం లేకుండా పోతుంది. "బ్రిలియంట్ స్టూడెంట్ చెడు వ్యసనాలకు దూరమైతే భరతమాత గర్వపడే మంచి డాక్టరౌతాడు"అని మంచి మాటలతో మనసు నొయ్యకుండా, ఎంతో వివరంగా మాట్లాడాడు. ఇంట్లోనే ఉన్న చక్రధర్ ఆ మాటలను విన్నాడు. మొగిలయ్య మాటలే మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటున్నాడు.

చెడు వ్యసనాలకు లోనై తన భవిష్యత్తు పాడు చేసుకుంటున్నానని తెలుసుకున్న చక్రధర్ హెడ్ కానిస్టేబుల్ మొగిలయ్య ఎదుటకు వచ్చి ఇక ఎప్పుడూ ఇటువంటి పనులు చేయను అంకుల్ బాగా చదువుకొని మెడిసిన్ పూర్తిచేస్తాను అని ప్రామిస్ చేశాడు. ఆ తరువాత వ్యసనాలకు దూరమై, కష్టపడి చదివి డాక్టరైనాడు.

మొగిలయ్య చక్రధర్‌ను అరెస్టు చేసి కేసు బుక్ చేస్తే అతను మొండిబారి ఒక దొంగగా తయారయ్యేవాడు. అలా కాకుండా మంచి మాటలతో చక్రధర్‌లో మంచి మార్పు తెచ్చి మన దేశానికి ఒక మంచి డాక్టరును అందించి లాఠీలో కరుణ ఉందని నిరూపించుకున్నాడు మొగిలయ్య.


విసుకు సాహిత్య మాసపత్రిక

చదవండి! చదివించండి!

చందాదారులు కండి!

సంవత్సర చందారూ. 120/-

విశిష్ట సభ్యత్వం రూ. 3000 /-